క్లుప్తంగా

జాతీయ రగ్బీ పోటీలకు తోటమూల విద్యార్థి



పెడన: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు పెడన తోటమూలకు చెందిన భట్ట మోహనరావు హైమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బొడ్డు పండు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 17 రగ్బీ పోటీల్లో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పండు ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబర్‌లో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి పండు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు గండు నరసింహారావులను శనివారం పాఠశాలలో జరిగిన అసెంబ్లీ కార్యక్రమంలో అభినందించారు.

వీళ్లు కూడా ప్రజాప్రతినిధులేనా..!



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరితో పాటు వచ్చిన కూటమి నాయకులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. ఎటువంటి హోదా లేని నాయకులు ఎమ్మెల్యేలకు కేటాయించిన ప్రత్యేక సీట్లలో కూర్చోవటం పలువుర్ని విస్మయానికి గురిచేసింది.

ఒడ్డుకు చేరిన వేట పడవలు




కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో మత్స్యకారులు తమ వేట పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. నాలుగు రోజుల పాటు గంగపుత్రులను వేటకు వెళ్లరాదంటూ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. పాలకాయతిప్ప సముద్ర శంకు వద్ద పడవలు లంగర్లు వేసి భద్రపర్చారు. వేట వలలను ఇళ్లకు చేర్చుకున్నారు.

దీప నివేదన



నాగాయలంక: కృష్ణాతీరంలో స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీపార్వతీ సమేత శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానంలో 32వ వార్షిక కార్తిక మాసోత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. దాతల ఆర్థిక సౌజన్యంతో 27 కిలోల ముద్ద కర్పూరం వినియోగించి అఖండ జ్యోతిని వెలిగించారు. తొలుత మూలవిరాట్‌కు ఎదురుగా ధ్వజస్తంభం వద్ద నిర్మించిన మూడు కుండాలలో కర్పూరపు దిమ్మెలు అమర్చి స్వామికి అద్భుత దీప నీరాజనం పలికారు. శ్రీరామపాదక్షేత్రంలో ఆదివారం ముగియనున్న నవ హారతుల వేడుక నేపథ్యంలో శనివారం రాత్రి 90 కిలోల నవధాన్యాలతో స్వామిని అలంకరించారు.

వంశీమోహన్ అనుచరులకు ముగిసిన పోలీస్ కస్టడీ



గన్నవరం/పెడన: పీసీసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై దాడి కేసులో అరెస్ట్ అయిన ఎనిమిది మంది నిందితుల రెండు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో శనివారం గన్నవరం కోర్టులో హాజరుపరిచారు. ఈ ఏడాది జనవరి 20న విమానాశ్రయం పక్కనే ఉన్న హోటల్ వద్ద రంగబాబుపై జరిగిన దాడి కేసులో పోలీసులు ఇటీవల పునర్ విచారణ చేపట్టారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ ముఖ్య అనుచరులైన తొమ్మిది మందిని కొత్తగా నిందితుల జాబితాలో చేర్చారు. వీరిలో ఓలుపల్లి మోహన్‌రంగా, ఎంపీపీ అనగాని రవి, తేలప్రోలు రాము, మేచినేని బాబు, సూరపనేని అనిల్ కుమార్, గుర్రం నాని, కర్నాటి నిరంజన్, గొన్నూరు శీనయ్యను ఈ నెల 19న అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో పోలీసుల రెండు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించడంతో నవంబర్ 29న సెంట్రల్ జైలు నుంచి పెడన పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. పోలీస్ కస్టడీ శనివారం సాయంత్రానికి ముగియడంతో నిందితులను మచిలీపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ పరీక్షలు చేయించారు. అనంతరం గన్నవరంలోని 8వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎదుట వారిని హాజరుపరిచి రిమాండ్ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలుకు పోలీసు భద్రత మధ్య బస్సులో తరలించారు.

మురుగు పారదు - గుంత పూడదు



పోతేపల్లి గ్రామంలో రోడ్లపై పారుతున్న మురుగునీరు



పోతేపల్లి గ్రామంలో మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

- సమస్యల వలయంలో పోతేపల్లి
- గృహాల మధ్యే మురుగునీరు
- గుంతలమయంగా రహదారులు

కోనేరుసెంటర్: ఆ ఊళ్లో మురుగు పారదు... దోమలు వీడవు... చెత్త కదలదు... రోడ్లు కుదుపుడు తప్పదు.. ఇన్ని రకాల సమస్యలతో పోతేపల్లి గ్రామస్తులు సహవాసం చేస్తున్నారు. నగరానికి కూత వేటు దూరంలోనే ఉన్న ఈ పంచాయతీలో సమస్యలు మాత్రం గట్టిగా తిష్ట వేశాయి. వీరి సమస్యలను పట్టించుకునే నాయకుడు లేడు.

అడుగడుక్కి గుంతలు

నగరానికి రెండు కిలోమీటర్‌ల దూరంలో పోతేపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామానికి వెళ్లాలంటే కిలోమీటర్ మేర అడుగడుక్కి గుంతలను దాటుకుంటూ వెళ్లాలి. వాహనదారులకైతే గుంతల కుదుపుడుకి నడుములు పోవాల్సిందే. రాత్రిపూట పాదచారులు గుంతల్లో పైకి లేచిన రాళ్ల ఎదురు దెబ్బలకు లబోదిబోమనక తప్పదు. ఈ గుంతలు ప్రతి పది మీటర్‌లకు ఒకటి దర్శనమిస్తున్నాయి. వీటికి మరమ్మతులు చేపట్టే నాథుడు లేకపోవటంతో గ్రామస్తులు దయనీయస్థితిలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

డ్రైనేజీ వసతి లేకపోవటం శాపం

గ్రామంలో డ్రైనేజీ వసతి లేకపోవటం ఆ ఊరి జనానికి శాపంలా మారింది. గృహాల్లోని వాడుక నీరు మొత్తం రోడ్లపైకి చేరటంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. వాడుక నీరు రోడ్ల పైకి చేరి రోజుల తరబడి నిల్వ ఉండటంతో మురుగు పేరుకుపోతోంది. అక్కడి నుంచి వచ్చే మురుగు వాసనతో పాటు స్థానికులు పడేసే ఇతర నిరుపయోగ వస్తువుల నుంచి వచ్చే దుర్గంధంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కనీసం కచ్చా డ్రైన్‌లను కూడా తవ్వించనందునే ఇళ్లల్లోని వాడుక నీరు రోడ్లపైకి పారుతోందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

దోమల దండోరా

మురుగు కారణంగా దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది రాత్రి వేళ గ్రామస్తులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. అసలే సీజనల్ వ్యాధులు.. వాటికి తోడు దోమల తాకిడితో ప్రజలు రోగాల బారిన వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామంలోని ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు చేరి నెలల తరబడి తిష్ట వేస్తున్నాయి. అక్కడ దోమలు వృద్ధి చెందటంతో పాటు గ్రామస్తులపై దాడి చేస్తూ రక్తం పీల్చేస్తున్నాయి. వీటి కారణంగా కంటి మీద కునుకు ఉండటంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు వీధిలైట్లు అరకొరగా వెలుగుతుండటంతో రాత్రి వేళ విషసర్పాలు సంచరిస్తున్నాయని గ్రామస్తులు భయపడుతున్నారు.

పెత్తనాల కోసం పోరాటం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ గ్రామానికి మరిన్ని వసతులు సమకూరుతాయని గ్రామస్తులు ఆశ పడ్డారు. అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి మాట అటుంచితే అధికార పెత్తనం కోసం కూటమిలోని రెండు పార్టీల పెద్దలు పోటీపడుతున్నారే తప్ప గ్రామ సమస్యలపై దృష్టి పెట్టటం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. పెత్తనం కోసం పోటీ పడకుండా సమస్యలు పరిష్కరించటంలో పోటీ పడితే తమ సమస్యలు త్వరగా తీరుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కార్తికేయుడిని దర్శించుకున్న మంత్రి కొల్లు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు బుద్ధపవన్‌కుమార్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కార్తికేయుని సన్నిధిలో ఆర్డీఓ స్వాతి

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని మచిలీపట్నం ఆర్డీఓ కె.స్వాతి శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షణ చేసి నాగపుట్టలో పాలు పోసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదం స్వీకరించారు. అనంతరం సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆర్డీఓ వెంట స్థానిక తహసీల్దార్ శ్రీవిద్య, ఇన్‌చార్జి ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'మీ కోసం' ఇక నుంచి తహసీల్దారు కార్యాలయంలోనే

పెడన: మండల స్థాయిలో జరిగే మీకోసం కార్యక్రమం ఇక నుంచి తహసీల్దారు కార్యాలయంలో మాత్రమే జరుగుతుందని, అర్జీదారులు ఎవరైనా తహసీల్దారు కార్యాలయంలోనే అందజేయాలని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన అర్జీలను తహసీల్దారు కార్యాలయంలోనే ఇవ్వాలని, వాటిని స్వీకరించి ఆయా శాఖలకు పంపిస్తామని చెప్పారు.

నగరంలో 95.69 శాతం పింఛన్‌ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ పంపిణీ నగరంలోని 50 డివిజన్‌లలో శనివారం ఉదయం నుంచి ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాదాపు 90 శాతంకు పైగానే పింఛన్‌లను పంపిణీ చేశారు. నగరంలో మొత్తం 18,544 పింఛన్‌లు ఉండగా వీటిలో సాయంత్రం 6.15 గంటల వరకూ 17,745 పింఛన్‌లను పంపిణీ చేసి 95.69 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. నగరంలోని 45వ డివిజన్‌లో కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పీవీ ఫణి కుమార్ పింఛన్‌లను పంపిణీ చేశారు.

పాల ఉత్పత్తిదారుల భవనం ప్రారంభం

పెడన: మండలంలోని పెనుమల్లిలో నూతనంగా నిర్మించిన పాల ఉత్పత్తిదారుల భవనాన్ని, జెడ్పీ నిధులతో నిర్మించిన చెరువు ర్యాంపును శనివారం మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, విజయ డెయిరీ జీఎం కొల్లి ఈశ్వరరావు, ఏజీఎం అన్వేష్, డైరెక్టర్ చలసాని చక్రపాణి, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సర్పంచి గరికపాటి రామానాయుడు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్లు పంపిణీ

కప్తానుపాలెం(మోపిదేవి): అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రక్షించేందుకు రైతులకు 50 టార్పాలిన్

సంక్షిప్త వార్తలు

లను అందజేసినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. ధాన్యం గుట్టగా నిలువచేసినా, గోదాములలో నిలువ చేసినా రంగు మారే ప్రమాదం ఉన్నందున వర్షాలు తగ్గేవరకు ధాన్యం మాసూలు చేయకుండా ఉండాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి హెప్సీబారాణి, వీఆర్‌ఓలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బందరులో ఈదురుగాలులతో వర్షం



మచిలీపట్నంటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో శనివారం నగరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులకు చెట్లు, కొమ్మలు నేల కొరిగాయి. పలు ప్రాంతాల్లో కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. లోతట్టు ప్రాంతాల్లో, రోడ్లపై వర్షపునీరు చేరటంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు.

దాతృత్వం చాటుకున్న ఇరాలి గ్రామస్తులు



కోడూరు: తమ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి గ్రామస్తులు కూడా తోడ్పాటునిచ్చి దాతృత్వం చాటుకున్నారు. మండలంలోని రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ పాఠశాలగా మార్చేందుకు అదనపు తరగతులు నిర్మాణానికి స్థలం అవసరమైంది. స్థలం సమకూరిస్తే విద్యాశాఖ అధికారులు జెడ్పీ పాఠశాలకు అనుమతిస్తారు. దీంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు స్థలం కొనుగోలు చేసేందుకు ముందడుగు వేసి రూ.50వేల నగదును ఇటీవల స్వచ్ఛందంగా అందించారు. దీంతో అదే పాఠశాల పరిధిలో ఉన్న ఇరాలి గ్రామస్తులు కూడా స్వచ్ఛందంగా రూ.40వేల నగదు అందించారు.

వరద బాధితులకు ఆసరా కల్పించండి

అవనిగడ్డ: ఇటీవల వచ్చిన వరదలకు ఇళ్లు దెబ్బతిన్న బాధితులను ఆదుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్లంక కాజ్‌వే దెబ్బతినడంతో తాత్కాలిక రహదారి వేశారని, శాశ్వత రహదారికి చేయూత నివ్వాలన్నారు. టీడీపీ నాయకులు ఎడ్లంకలో భారీ వనసమారాధనకు బదులు ఆపదలో ఉన్న ఎడ్లంక వాసులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

రాజ్యాంగం కల్పించిన చట్టాలను అమలు చేయాలి

మచిలీపట్నంటౌన్: దళితులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధికి రాజ్యాంగం కల్పించిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. స్థానిక మోదుమూడి శ్రీహరిరావు భవనంలో శనివారం సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5, 6,7 తేదీలలో ఏఐడీఆర్ఎం రెండవ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగుల పేరయ్య, జిల్లా నాయకుడు సురేష్, ఏఐటీయూసీ నాయకుడు ఒంటిపులి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కోడూరు: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, చదువుపైనే దృష్టి సారించాలని ఎస్ఐ చాణిక్య అన్నారు. స్థానిక కోట రాఘవయ్య విద్యా సంస్థలలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు, డైరెక్టర్ వలభనేని వరప్రసాద్, ప్రిన్సిపాల్స్ కరుణ, అనిల్‌కుమార్, జగన్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, అవనిగడ్డ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ వంగర శేషగిరిరావు, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.వీరకుమారి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గుడివాక శేషుబాబు, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే శ్రద్ధాంజలి

సార్లగొంది(నాగాయలంక): మండలంలోని సార్లగొందిలో అనారోగ్యంతో మరణించిన మాజీ సర్పంచి కొక్కిలిగడ్డ నాగబసవయ్య భౌతికకాయాన్ని శనివారం అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన వెంట కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది చిన్నారి, గుంటూరు సురేష్, వనమాల రమేష్ ఉన్నారు.

సీపీఎం మండల కమిటీ ఎంపిక

బంటుమిల్లి: సీపీఎం పార్టీ నాలుగవ మండల మహాసభ శనివారం స్థానిక గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో జరిగింది. మహిళా నాయకురాలు మాజేటి పద్మ అధ్యక్షతన జరిగిన సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం 11 మంది సభ్యులతో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో మాజేటి శివశ్రీనివాసరావును మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన మండల కమిటీ సమావేశంలో బంటుమిల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలని, రైతులకు తేమ శాతంతో నిమిత్తం లేకుండా ధాన్యం మొత్తం కొనాలంటూ తీర్మానాలు చేసి ఆమోదించారు. సభలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు, ఐద్వా నాయకురాలు పి.ధనశ్రీ, కార్మిక సంఘ మండల కార్యదర్శి బొడ్డు నాగరాజు, ఎల్.అజయ్‌ఘోష్, పి.వెంకన్న, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గిన తరువాతే కోతలు కోయండి

జేసీ గీతాంజలి శర్మ



బల్లిపర్రు ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న జేసీ గీతాంజలి శర్మ

పెడన:వర్షాలు మూడు రోజులు పాటు ఉంటాయని, రైతులు వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత కోతలు కోసుకోవాల్సిందిగా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. ఆమె శనివారం మండలంలోని పెడన, బల్లిపర్రు, నందమూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సిబ్బంది నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు విక్రయించిన ధాన్యం బస్తాలను పెడన కాకుండా మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోని పెడన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తేమ శాతం ఏ విధంగా లెక్కిస్తున్నారు? ఇప్పటివరకు ఎంత మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారనే విషయాలపై ఆరా తీశారు. బల్లిపర్రులో 66 మంది రైతుల నుంచి 5.03 టన్నులు, నందమూరులో 88 మంది రైతుల నుంచి 6.05 టన్నులు కొనుగోలు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ వివరించారు. గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా వివరాలను చెప్పడానికి ఇబ్బంది పడటంతో ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్లిపర్రు, నందమూరు రైతు సేవా కేంద్రాలకు ఒకరే ఉండటంపై ఆరా తీశారు. నందమూరు రెగ్యులర్ ఎంపీఈఓ కీర్తి ఉన్నారని, బల్లిపర్రుకు ఇన్‌చార్జిగా ఉంటున్నారని చెప్పగా, రైతులు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 3వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ జేసీకి వివరించారు. వీరితో పాటు డీసీఎంఎస్ ఫీల్డ్ ఇన్‌చార్జి నవీన్, వీఆర్వోలు ఉన్నారు.

మచిలీపట్నంను రోల్‌మోడల్‌గా చేసేందుకు కృషి

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



కమ్యూనిటీహాలు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

కోనేరుసెంటర్: పెద్దల సహకారంతో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పేలా వ్యాపారులను ప్రోత్సహించి మచిలీపట్నాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం మండలం పోతేపల్లి జువెలరీ పార్కులో రూ.1.98 కోట్ల పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ లిమిటెడ్, న్యూఢిల్లీ వారి సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ ట్రేడ్ సెంటర్ భవన నిర్మాణ పనులకు శనివారం ఆయన ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరో 25 ఎకరాలను సేకరించి జువెలరీ పార్కు విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 500 కంపెనీలు ఉన్నాయని, వీటి ద్వారా వేలాది మంది ఉద్యోగాలు పొంది నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం గోల్డ్ కవరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి, ఆర్టీసీ చైర్మన్, ఎంపీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం వెంకటరావు, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ రాయన్న, జనసేన పార్టీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, బీజేపీ నాయకుడు సోడిశెట్టి బాలాజీ, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకుడు మాదివాడ రాము, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, అధికారులు, గోల్డ్ కవరింగ్ కంపెనీల యజమానులు పాల్గొన్నారు.

ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

క్షేత్రస్థాయిలో తహసీల్దార్, ఎస్ఐ పర్యటన



ఏటిమొగ వద్ద ప్రయాణికులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

ఏటిమొగ(నాగాయలంక): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను కారణంగా నాగాయలంక మండలం తీర గ్రామాల పరిధిలో బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ హెచ్చరించారు. తుపాను వాతావరణం నేపథ్యంలో శనివారం ఆయన స్థానిక ఎస్ఐ కలిదిండి రాజేష్, ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్‌లతో కలసి ఏటిమొగ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను కలసి సూచనలు, హెచ్చరికలు చేశారు. ఏటిమొగ–ఎదురుమొండి నడుమ కృష్ణానదిలో పడవ ప్రయాణం చేసేవారు అత్యవసర సందర్భాలలోనే ప్రయాణం చేయాలని సూచిస్తూ, పడవలలో ఓవర్‌లోడ్ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. వర్షం, గాలుల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణం రెవెన్యూ, పోలీసు వారికి సమాచారం అందించాలని చెప్పారు.

నేలవాలిన వరిపొలాలు.. ఆందోళనలో అన్నదాతలు



కోడూరులో నేలవాలిన వరిపొలాలు



మోపిదేవిలో రోడ్డుపై పోసిన ధాన్యం

కోడూరు: ఈదురుగాలుల తీవ్రతకు వరి పంట నేలవాలింది. మండలంలో ఈ ఏడాది 15వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. కేవలం 500 ఎకరాల్లో మాత్రమే రైతులు యంత్రాల సహాయంతో వరికోతలు కోసి ధాన్యాన్ని రహదారుల వెంట రాశులు పోశారు. ఈదురుగాలులు, వర్షానికి 40 శాతంకు పైగా వరిపంట నేల వాలింది. లింగారెడ్డిపాలెం, మాచవరం, వి.కొత్తపాలెం, కోడూరు, దింటిమెరక, నక్కవానిదారి, నరసింహాపురం గ్రామాల్లో వరిపంటకు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు.

రైతు కంట కన్నీరు

మోపిదేవి: ఫెంగల్ తుఫాన్‌తో రైతులు పండించిన ధాన్యం తడిసి ముద్దయింది. కూటమి ప్రభుత్వం ధాన్యం దాచుకోవడానికి గోదాములు, కనీసం గోనుసంచులు అందించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ఎక్కడికక్కడ రోడ్లపై ఆరబెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలతో రైతుల్లో ఆందోళన

కృత్తివెన్ను: శనివారం మధ్యాహ్నం నుంచి మండల వ్యాప్తంగా వర్షం కురి సింది. ప్రస్తుతం ఖరీఫ్ పంట కోతకు వచ్చి ఉండటంతో ఇప్పుడు కురిసే వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతామని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు 7 వేల పైచిలుకు ఎకరాలలో ఖరీఫ్‌ను సాగు చేశారు. చినపాండ్రాక, చెరుకుమిల్లి, యండపల్లి గ్రామాల్లో కొంతమంది రైతులు వరికోతలు సైతం ప్రారంభించారు. వర్షాలకు తోడు గాలులు వీస్తే పంట నేలవాలి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్‌లు పంపిణీ చేసిన మంత్రి కొల్లు



పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎంపీ బాలశౌరి

మచిలీపట్నంటౌన్: నగరంలోని 46 వ డివిజన్ నారాయణపురం శ్రీ కోదండ రామాలయం వద్ద రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. తొలుత శ్రీ భగీరథ మహర్షి చిత్రపటానికి వారు పూజలు చేశారు. అనంతరం శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు మీడియాతో మాట్లాడుతూ ఉదయం పది గంటల సమయానికే జిల్లాలో 2.70 లక్షల మందికి 80 శాతం పింఛన్లు పంపిణీ చేశామని, మచిలీపట్నం నియోజకవర్గంలో సుమారు 30,500 మందికి 78 శాతం మేరకు పంపిణీ చేశామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, 46 వ వార్డు సచివాలయ కార్యదర్శులు శివమణి, శిరీష, రాజేంద్ర,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ఆర్డీఓకు టీడీపీ నాయకుల వినతి



కాసానగర్ వద్ద రోడ్డుపై ఆరపోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ స్వాతి

కాసానగర్(మోపిదేవి): తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని టీడీపీ నాయకులు, రైతులు ఆర్డీఓకు విజ్ఞప్తిచేశారు. మచిలీపట్నం ఆర్డీఓ కె.స్వాతి మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. కాసానగర్ వద్ద జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓకు టీడీపీ నాయకులు రైతు సమస్యలను వివరించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో కనీసం గోనెసంచులు కానీ, టార్పాలిన్‌లు కాని ప్రభుత్వం ఇవ్వలేదని రైతులు వాపోయారు. మిల్లులు వద్ద ధాన్యం దిగుబడిని తీవ్ర ఆలస్యం చేస్తున్నారని రైతులు వివరించారు. ఈ సందర్భంగా అప్పటికే పలు గ్రామాల్లో పర్యటించి వచ్చిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ అకాల వర్షాల కారణంగా ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలు అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆర్డీఓను కోరారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్



లంకపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఘంటసాల(అవనిగడ్డ): వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని లంకపల్లిలో వర్షాలకు తడిచిన రహదారి పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ముతక రకం ధాన్యంను ఎంఎస్‌పీ ధరకు మించి కొనుగోలు చేసినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కనీస మద్దతు ధర రూ.1725 ఉంటే రూ.1400కే కొంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రైతు భరోసా ఈ ప్రభుత్వంలో ఇవ్వలేదని, ఇన్‌పుట్ సబ్సిడీ లేదని, రైతులకు సరిపడా మినుము విత్తనాలు సరఫరా లేదని సింహాద్రి అన్నారు. ధాన్యంను మిల్లర్లకు తరలించేందుకు రోజంతా ఎదురు చూడాల్సి వస్తోందని, ట్రాక్టర్లకు జియో టాగింగ్ ఇవ్వడం వల్ల వేరే ట్రాక్టర్లను తీసుకెళ్లే అవకాశం లేదని, దీనివల్ల ట్రాక్టర్ డ్రైవర్లు ధాన్యం తీసుకెళ్లేందుకు ముందుకు రావడం లేదన్నారు. పండించిన ప్రతి గింజా కొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోడెం నాగరాజుతో పాటు పలువురు పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.